# విపత్తుకు మరమ్మతు

**భౌగోళిక స్వరూపంపై బిట్స్ పిలాని అధ్యయనం ● పరిశోధన సంస్థలతో బల్దియా మేధోమథనం**

ఈనాడు, హైదరాబాద్



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు, నిపుణులు

ఒక్క వర్షాకాలంతో హైదరాబాద్ ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.వేల కోట్లు నష్టపోతోంది. నగరవాసులు అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. విపత్తును ఎదుర్కోవడంలో, పరిష్కారాలను సకాలంలో అందించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవడం వల్లే ఈ ఇబ్బందులు. నిపుణులు పరిష్కార మార్గాలపై చేస్తోన్న అధ్యయనం విద్యాసంస్థలకే పరిమితమవుతుంటే.. అధికారుల చర్యలు వర్షాకాలంలో అటకెక్కుతున్నాయి. ఏళ్లనాటి ఈ సంస్కృతికి స్వస్తి చెబుతూ బల్దియా మొదటిసారి పరిశోధన సంస్థలతో మంగళవారం మేధోమథనం నిర్వహించింది. ఫలితంగా నగరంలోని వేర్వేరు సంస్థలు విపత్తుల నివారణపై చేస్తోన్న అధ్యయనాలు ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి వచ్చాయి. భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పనకు మార్గం ఏర్పడింది.

ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులు నగరాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని సమావేశంలో పాల్గొన్న నిపుణులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే చెన్నై, ముంబయి, హైదరాబాద్ వంటి నగరాలు గతానికి భిన్నంగా అధిక వర్షపాతాలను నమోదు చేస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మార్పులు సంభవించవచ్చని, వాటికి నగరాన్ని సిద్ధంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వ, పరిశోధన సంస్థలపై ఉందని నిపుణులు తేల్చారు. కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్.బి.జనార్దన్‌రెడ్డి సైతం నిపుణుల సూచనలపై సుదీర్ఘంగా చర్చించారు. పరిశోధకులు చెప్పే పరిష్కార మార్గాలు ఖర్చుతో కూడుకున్నవని, తక్కువ ఖర్చుతో జరిగే పనుల్ని సూచించాలని కోరారు. అయితే వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు జీహెచ్ఎంసీ ఖర్చు చేసేది రూ.100కోట్లు కాగా, వాటిపై ప్రయాణించే వాహనాలు, వరదలో చిక్కుకున్న వాహనాలు, అనారోగ్యం పాలైన ప్రజలు పరోక్షంగా రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని నిపుణులు అభిప్రాయ పడ్డారు.

## బిట్స్ పిలానీ ఇలా..

"హైదరాబాద్ మహానగరం అంటే కొండలు, గుట్టలు, చెరువులు, నాలాల కలయిక. గొలుసు కట్టు చెరువుల వ్యవస్థ వల్ల నగరం ఎంత పెద్ద వర్షాన్ని అయినా తట్టుకోగలుగుతుంది. మధ్యలో ప్రవహిస్తోన్న మూసీ నది హైదరాబాద్‌కు మరో వరం. అయితే ఆక్రమణలు, నగరీకరణ వల్ల భౌగోళిక పరిస్థితి భిన్నంగా మారింది. ఈ నేపథ్యంలో వరద ప్రవాహ మార్గాన్ని ఆధారంగా చేసుకుని నగరాన్ని విభాగాలుగా చేశాం. వాటిలో ఎంత సమయం, ఎంత తీవ్రతతో వర్షం కురిస్తే ఎన్ని ప్రాంతాలు నష్టపోతాయి. ఇతరత్రా అంశాల వారీగా అధ్యయనం చేస్తున్నాం. ఫలితాల ఆధారంగా పరిష్కార మార్గాలను రూపొందిస్తాం."

## జోన్ల వారీగా చెరువులు తవ్వాలి..

"నగరం కృష్ణ, గోదావరి నది పరివాహక ప్రాంతాల కలయిక. పాతబస్తీ నుంచి మియాపూర్ వరకు కురిసే వర్షం మూసీనదిలో కలిస్తే.. మియాపూర్ అవతలి వరద అవతలి వైపు వెళ్తుంది. అలాగే పశ్చిమ, తూర్పు నగరంలో పెద్దయెత్తున పరిశోధన, విద్యాసంస్థలు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. వాటిలోని ఖాళీ స్థలంలో చెరువులను తవ్వటంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల వరదను కృత్రిమ నీటి ట్యాంకులకు మళ్లించే ఏర్పాట్లు చేయాలి."అని ఈఎస్‌సీఐ(ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) నిపుణులు బి.వి.సుబ్బారావు జీహెచ్ఎంసీకి సూచించారు. వారం రోజుల్లో పరివాహక ప్రాంతాలపై సమగ్ర నివేదిక ఇస్తామని కమిషనర్ జనార్దన్‌రెడ్డికి తెలిపారు.

## మేము సైతం అన్న ఐఐటీ..

ఓయూ, జేఎన్‌టీయూహెచ్‌లోని పరిశోధన సంస్థలతోపాటు ఐఐటీ హైదరాబాద్ నిపుణులు సైతం విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన పరిష్కార మార్గాలపై, నాణ్యమైన రహదారులపై నివేదిక ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. బల్దియా ఇంజినీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.